క్లుప్తంగా

నేడు సాలీపేట ఉర్దూ స్కూల్‌లో వైద్య శిబిరం

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాలీపేటలోని మున్షి మస్తాన్ ఉర్దూ ఎలిమెంటరీ స్కూల్‌లో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 24వ సచివాలయం పరిధిలోని ప్రజలకు ఇక్కడ వైద్య సేవలు అందించటం జరుగుతుందన్నారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ



తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కంటి చూపుతో ఇబ్బందిపడే విద్యార్థులకు ప్రభుత్వం గురువారం కళ్లజోళ్లు ఉచితంగా అందించింది. తెనాలి మండలం పెదరావూరులోని జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఇటీవల కంటి పరీక్షలు నిర్వహించారు. కళ్లజోళ్లు అవసరమైన 11 మందికి వాటిని ఉన్నతాధికారులు పంపారు. గురువారం వాటిని ఉపాధ్యాయులు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు టి.సరళ, ఉపాధ్యాయులు వెంకటప్పారావు, రాజేశ్వరి, మాధవికుమారి, కృష్ణ, ఆరోగ్య సిబ్బంది కె.శ్రీనివాసరావు, ఎ.అరుణ, ఎ.శిరీష, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ



తెనాలిఅర్బన్: క్షయ వ్యాధి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల సూచించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో తెనాలి పట్టణంలోని క్షయ వ్యాధిగ్రస్తులకు సాలీపేటలో గురువారం పౌష్టికాహారాన్ని ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీబీ తెనాలి సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్, 19వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు చుండూరు సాయి, హెల్త్ విజిటర్‌లు పుష్పలత, దాసరి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

29న రేవేంద్రపాడులో ఉచిత మెగా వైద్యశిబిరం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడులో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు మానవ సేవా సంస్థ అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29వ తేదీ ఆదివారం రేవేంద్రపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ఈ శిబిరంలో డయాబెటిక్ వైద్యుడు వేణుగోపాల్‌రెడ్డి, గుండె జబ్బుల వైద్యుడు వంశీకృష్ణ, నరాలు మరియు నాడీ వైద్యుడు ఎం.ఎ. అమీన్, జనరల్ వైద్యుడు నిఖిల్, కీళ్లు ఎముకల వైద్యుడు కడియాల విజయకృష్ణ, గైనకాలజీ (స్త్రీల) వైద్యుడు ధర్మజా దండమూడి, దంత వైద్యుడు కె. శ్రీకర్, చర్మ వైద్యులు డాక్టర్ మహేష్, లక్ష్మి కంటి పరీక్షా కేంద్రం కంటి వైద్యులు, ఆయుర్వేద వైద్యుడు రవిబాబు, ఫిజియోథెరపి వైద్యుడు బాషాలు తమ సేవలను అందించనున్నారని, వైద్యుల సలహా మేరకు షుగర్ పరీక్షలు, బీపీ పరీక్షలు, 2డీ ఎకో పరీక్షలు, ఈసీజీ పరీక్షలు, బోన్ మినరల్ డెన్సిటీ పరీక్షలు వైద్యుల పర్యవేక్షణలో ఉచితంగా చేస్తామని, ఈ అవకాశాన్ని రేవేంద్రపాడు పరిసర ప్రజలు వినియోగించుకోవాలని మానవ సేవా సంస్థ అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్ ఆ ప్రకటనలో కోరారు.

భర్త కనిపించడం లేదంటూ ఫిర్యాదు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడులో నివసించే ఓ మహిళ తన భర్త కనిపించడం లేదంటూ గురువారం తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ వినోద్ తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా, ఎర్రగుంటపాలెం మండలం, తంగిరాలపల్లె గ్రామానికి చెందిన పిన్నెబోయిన బాలశేఖర్‌కు, నాగలక్ష్మికి వివాహమైంది. వారికి ముగ్గురు సంతానం. మహానాడులోని 3వ లైన్‌లో నివాసముంటూ బతుకుదెరువు కోసం నాగలక్ష్మి ఇళ్లలో పనిచేసుకుంటుండగా, బాలశేఖర్ లాడ్జిలో బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17వ తేదీన నాగలక్ష్మిని తన ద్విచక్రవాహనంపై పనిచేసే దగ్గర దించి, లాడ్జికి వెళుతున్నాని చెప్పి తిరిగి రాలేదు. లాడ్జి యజమానులను అడగ్గా పనికి రాలేదని తెలియజేశారు. చుట్టుపక్కల, బంధువుల దగ్గర బాలశేఖర్ గురించి విచారణ చేసినప్పటికీ ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో నాగలక్ష్మి ఫిర్యాదు చేసిందని, ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వినోద్ తెలిపారు.



సామాజిక సాధికార బస్సు యాత్రలో మట్టికుండ తయారీ విధానాన్ని నిశితంగా పరిశీలిస్తున్న మంత్రులు ఆదిమూలపు సురేష్, జోగి రమేష్, మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, దొక్కా మాణిక్యవరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నేతలు



సామాజిక సాధికార బస్సు యాత్రకు పూలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

రాష్ట్రంలో సామాజిక సాధికారత

ముఖ్యమంత్రి జగనన్న నేతృత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట - ఎమ్మెల్యే శివకుమార్



తెనాలిఅర్బన్: భారతదేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో సామాజిక సాధికారత సాధ్యపడిందని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సుయాత్ర బహిరంగ సభను మార్కెట్‌లోని అన్నాబత్తుని సత్యనారాయణ పురవేదిక వద్ద గురువారం సాయంత్రం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారాన్ని సీఎం జగన్ అందించారని గుర్తుచేశారు. తెనాలి నియోజకవర్గంలో 27 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చినట్లు చెప్పారు. వారిలో బీసీలు 12500, ఎస్సీలు ఆరువేలు, ఎస్టీలు రెండు వేలు, అగ్రవర్ణాలోని ఓసీలు 4500 మంది ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలోని పేదలను ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. దానిని ఆచరించి సామాజిక ఆర్థిక, సాధికారతను రాష్ట్రంలో సాధించగలిగమని వివరించారు. పేద ప్రజలకు తమ ప్రభుత్వం మంచి చేస్తేనే వైఎస్సార్‌సీపీకి వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేయాలని సీఎం జగన్ ధైర్యంగా అడుగుతున్నారని గుర్తుచేశారు. అంత దమ్ము ధైర్యం ఉన్న ఏకైక రాజకీయ నాయకుడు జగన్ అని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించి అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. తెనాలి నియోజకవర్గంలో ఇప్పటివరకు అనేక సంక్షేమ పథకాల ద్వారా రూ.1800 కోట్లు పేద ప్రజలందరికీ అందచేయడం జరిగిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా తాను వెళ్లానని ఇళ్లు ఎక్కని గడప తెనాలి నియోజకవర్గంలో లేదని చెప్పారు. పేదరిక నిర్మూలన పూర్తిగా అంతమొందాలంటే వైఎస్సార్‌సీపీని రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. అనంతరం హైకోర్టు న్యాయవాది షేక్ నాగూర్‌బాబు రూపొందించిన జయహో జగనన్న వీడియో సాంగ్‌ను మంత్రులు ఆవిష్కరించారు. అనంతరం సభకు హాజరైన మంత్రులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలను ఎమ్మెల్యే శివకుమార్ ఘనంగా సన్మానించి మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ తిరుమలశెట్టి శ్రీనివాసరావు, తాడిబోయిన రామయ్య, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు మన్నవ ప్రభాకర్, కావేటి నిర్మల, సుష్మ, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ దొడ్డక సీతామహాలక్ష్మి, కొల్లిపర వైస్‌ఎంపీపీ బొల్లిముంత పోతురాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోతిరెడ్డి హేమలత, కొమ్ము రాయల్, కుక్కల ముక్తేశ్వరరావు, కాకిదేవ సహాయం, కఠెవరపు దేవయ్య, కొడాలి క్రాంతి, దామర్ల విజయరాణి, కోలా వాసు, కంభం వాసు, అద్దంకి వేణుగోపాల్, ధర్మరాజులు చెన్నకేశవులు, పెసర్లంక రమణ, కూరగంటి రవిశంకర్, కాకాని వెంకటేశ్వర్లు, కాళిదాసు వెంకటసత్యం, కాళిదాసు వెంకటేశ్వరరావు, సుధాకర్, ముంతా ప్రసాద్, ప్రసాదం బాలగురవమ్మ, ప్రసాదం సురేష్, షేక్ గఫూర్, షేక్ మీరావలి, బూరెల దుర్గాప్రసాద్, కఠారి హరీష్, రెడ్డి రమణమ్మ, దేసు శ్రీనివాసరావు, శానంపూడి రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సామాజిక సాధికార బస్సు యాత్రలో పాల్గొన్న చిరువర్తకుల వస్తు సామగ్రిని ప్రదర్శిస్తున్న మంత్రి రమేష్, ఎమ్మెల్యే శివకుమార్ తదితరులు



శంఖం ఊదుతూ యాత్రలో పాల్గొన్న జంగమదేవరలు



ఉత్సాహంగా పాల్గొన్న చేనేత కార్మికులు



యాత్రకు మద్దతు తెలిపిన దర్జీలు



వైఎస్సార్ సీపీ జెండాతో కల్లుగీత కార్మికుల ఆనందోత్సాహం



బస్సుపై పూలు చల్లుతున్న అభిమానులు, కార్యకర్తలు



అభిమానంగా యాత్రకు తరలివచ్చి మద్దతు తెలిపిన కాటిపాపలు

ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్న సీఎం జగన్

మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్

తెనాలిఅర్బన్: ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ పేర్కొన్నారు. సాలీపేటలోని మున్షీ మస్తాన్ ఉర్దూ ఎలిమెంటరీ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. అక్కడ అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కోసం సీఎం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రజలందరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ దేవికావాణి, డాక్టర్ షారోన్ రజిత్, డాక్టర్ యదునందన్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ జగం శ్యామ్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, ఎసీపీ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి చైర్మన్ హరిప్రసాద్

జాతీయ త్రోబాల్ పోటీల్లో బహుమతులు



మహిళలు, పురుషుల జట్ల క్రీడాకారులు

తెనాలి: జాతీయస్థాయి త్రోబాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ మహిళల జట్టు రన్నర్స్ స్థానాన్ని గెలుచుకోగా, పురుషుల జట్టు తృతీయ బహుమతిని దక్కించుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని బిజినూర్‌లో ఈనెల 22–24 తేదీల్లో జాతీయ త్రోబాల్ పోటీలు జరిగాయి. రన్నర్స్‌గా నిలిచిన మహిళల జట్టును, తృతీయ బహుమతిని గెలిచిన పురుషుల జట్టు క్రీడాకారులను రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ కార్యదర్శి ప్రభుకుమార్, జిల్లా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రావిపాటి వీర నారాయణరావు, సంఘ సభ్యులు బాలాజీనాయక్, నల్లూరి వెంకటేశ్వరరావు అభినందించారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్‌లో ఓ ద్విచక్రవాహనం ఢీకొనగా, గాయపడి ఓ వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఎస్‌ఐ వినోద్ తెలిపిన వివరాల ప్రకారం గత మూడు రోజుల క్రితం మంగళగిరి చెందిన అడిగొప్పల బుల్లి (ఈశ్వర్), బూడిద గోపిలు విజయవాడ నుంచి తమ స్నేహితుని ద్విచక్రవాహనంపై మంగళగిరి వస్తున్నారు. అదే రహదారిలో అతివేగంగా వస్తున్న ఓ కారు అడిగొప్పల బుల్లి తోలుతున్న ద్విచక్రవాహనానికి తగలడంతో ఆ వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే వెళుతున్న వెంకటేశ్వర క్యాటరింగ్‌లో పనిచేస్తున్న రాజు (50)కు తగలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అతడ్ని చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంఘటనపై అడిగొప్పల బుల్లి (ఈశ్వర్) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వినోద్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తి పేరు రాజు అని మాత్రమే తెలుసునని, మిగిలిన వివరాలు తెలియదని, ఎవరికైనా రాజు వివరాలు తెలిస్తే తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ వినోద్ కోరారు.

ప్రమాదవశాత్తూ చెరువులో పడి వ్యక్తి మృతి

తాడికొండ: ప్రమాదవశాత్తు వ్యక్తి చెరువులో పడి మృతి చెందిన ఘటన తాడికొండ మండలం కంతేరు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంతేరు గ్రామానికి చెందిన బుల్లా కోటేశ్వరరావు(40) చిన్నతనం నుంచి మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల కాలంలో ఈ సమస్య అధికమైంది. గురువారం బహిర్భూమికి వెళ్లగా చెరువు ఒడ్డున ఫిట్స్ రావడంతో చెరువులో పడి మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగార్జున తెలిపారు .

అనారోగ్య సమస్యలతో వివాహిత ఆత్మహత్య

తాడికొండ: అనారోగ్య సమస్యలతో వివాహిత ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన ఘటన తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిడుముక్కల గ్రామానికి చెందిన శెట్టి రాధిక(36) గతకొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ బుధవారం సాయంత్రం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, బంధువులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగార్జున తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తి హత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తిని తన స్నేహితుడు హత్య చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటరమణ కాలనీకిచెందిన బి.ఓంకారాచారి (20), సీతమ్మకాలనీకి చెందిన వెంకటేశ్వర్లు ఇరువురు స్నేహితులు. ఇరువురు బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఇరువురు కలిసి బుధవారం రాత్రి శ్యామలానగర్ రైల్వేగేటు సమీపంలో సాయికృష్ణ బార్‌కు వెళ్లి అతిగా మద్యం సేవించారు. బార్ బయటకు వచ్చి ఇరువురు ఘర్షణ పడ్డారు. వెంకటేశ్వర్లు తన చేతిలోని మద్యం బాటిల్‌తో ఓంకారాచారిని పొడిచి పారిపోయాడు. స్థానికులు బాధితుడిని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఓంకారాచారి మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

తెనాలిఅర్బన్: రెయిన్‌బో ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సంయుక్త ఆధ్వర్యంలో ఓమెగా హాస్పటల్ వారి సహకారంతో గురువారం ప్రకాశం రోడ్డులో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ జీవనలత, డాక్టర్ మహితి, డాక్టర్ రసజ్ఞలు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. షుగర్, ఆర్‌బీఎస్, థైరాయిడ్ వంటి పరీక్షలు కూడా ఉచితంగా చేశారు. అవసమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెయిన్ బో ట్రస్ట్ సభ్యులు కళ్యాణి, వరలక్ష్మి, జ్యోతి, గాయత్రీ, రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం ప్రతినిధులు కన్నెగంటి మురళీకృష్ణ, పావులూరి రాంబాబు, జి.వెంకటరత్నం, కొఠారి చేతన్, నరేష్, కిరణ్, నల్లూరి వెంకటేశ్వరరావు, జగదీశ్వరాంబ, అర్జున్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మహిళను పరీక్షిస్తున్న డాక్టర్ జీవనలత

కంద రైతులను ఆదుకోవాలి

తాడేపల్లిరూరల్: కంద పంట వేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో రైతు సంఘం నాయకులతో కలసి ఆయన కంద పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ కంద పంటకు తెగులు రావడం వలన తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఒక్కో ఎకరానికి గతంలో 100 పుట్ల వరకు దిగుబడి సాధించేదని, ప్రస్తుతం పండు తెగులు రావడంతో 30 పుట్లు కూడా రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కంద విత్తనం ఇతర రాష్ట్రాల నుంచి తీసుకుని వచ్చి, పొలంలో నాటి, పెట్టుబడులు పెట్టి, రైతు చేతికి పంట వచ్చేనాటికి మొత్తం ఖర్చు రూ.3 లక్షల వరకు అవుతోందని, కానీ తెగులు వలన కంద దుంప దిగుబడి సాధించక, పొలంలోనే కాండం ఎండిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. వ్యవసాయ అధికారులు కందపంటకు సోకిన పండు తెగులు నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలని, నష్టపోయిన కందపంట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ గ్రామోత్సవం

పెదకాకాని: దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా నంబూరు జయభారతరెడ్డి నగర్‌లో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంబూరు గ్రామంలో బుధవారం రాత్రి కనకదుర్గమ్మకు మేళ తాళాలు, బాణ సంచా భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నల అవినాష్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు భీమిరెడ్డి వేణుగోపాలరెడ్డి, కూసం విష్ణు, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.